# యథేచ్ఛగా కలప దందా

- నేల కూలుతున్న పచ్చని చెట్లు
- నిద్ర మత్తులో అధికారులు



టి.లింగంపల్లి మీదుగా కలపతో వెళ్తున్న లారీ

రేగోడ్(మెదక్): అధికారుల అండదండలతో అక్రమంగా కలప వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమార్కులు కలపను వ్యాపారులు జిల్లా దాటిస్తున్నారు. ఆరు నెలలుగా ఈ దందా జరుగుతున్నా.. ఒక్కటి కూడా పట్టుబడ లేదంటే జిల్లా అధికారులకే తెలియాలి. రేగోడ్ మండలంలో చెట్ల నరికివేత యథేచ్ఛగా కొనసాగుతోంది. కోత మిషన్‌లకు పచ్చని భారీ వృక్షాలు నేల కూలుతున్నాయి. చీమ చిటుక్కుమన్నా పసి గట్టే అధికారులు నిద్రావస్థలో ఉన్నారా అనే అనుమానాలు లేకపోలేదు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఉన్నాయి. ఈ నిఘా నేత్రాలు, అధికారుల కళ్లు గప్పి కలప వ్యాపారం జరుగుతుందా.. అధికారులకు తెలిసే జరుగుతుందో అంతులేని ప్రశ్నగా మిగులుతోంది. చెట్లను పెంచాలని గత ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి మొక్కలను నాటినా.. మళ్లీ చెట్లను నరికివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. నిబంధనల పేరిట సామాన్యులకు ఇబ్బందులకు గురిచేసే అధికారులు పర్యావరణాన్ని హరిస్తూ లక్షలాది రూపాయలు జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు కనిపించడం లేదా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని టి.లింగంపల్లి మీదుగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వైపు కలప లారీ వెళ్తుంది. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువెత్తు సాక్ష్యం. పై విషయమై ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్ వద్ద బుధవారం ప్రస్తావించగా.. మా కింది స్థాయి అధికారులు ఏమైనా పర్మిట్లు ఇస్తున్నారా లేదా అనే విషయం తెలియదని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## క్లుప్తంగా

### పరీక్షలకు హాజరు కావాలి



డా.శ్రీనివాసులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసులు అన్నారు. ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాలతో నిర్వహిస్తున్న పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని సూచించారు.

### స్థల పరిశీలన పూర్తి



నర్సాపూర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, అధికారులు

నర్సాపూర్: తాగునీటి ట్యాంకులు నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం పట్టణానికి అమృత్–2.0 పథకం కింద 13లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల రెండు ట్యాంకులు నిర్మించేందుకు రూ.11కోట్ల 90లక్షలు వచ్చాయని ఆ నిధులతో ట్యాంకులు నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. పట్టణంలోని నాలుగు, తొమ్మిదవ వార్డుల్లో ట్యాంకులు నిర్మించాలని నిర్ణయించామన్నారు. కాగా ఈనెల 19న రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేస్తారని వారు వివరించారు. వారి వెంట మున్సిపల్ అధికారులు, నాయకులు ఉన్నారు.

### సర్వే చేపట్టిన అధికారులు



నర్సాపూర్‌లోని ఐదవ వార్డులో సర్వే చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీలోని ఐదవ వార్డులో మిగిలిపోయిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే శుక్రవారం నిర్వహించారు. ఈనెల 13న సాక్షిలో అసంపూర్తిగా ఇళ్ల సర్వే అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ రామకృష్ణరావు స్పందించారు. ఐదవ వార్డులో సాంకేతిక కారణాలతో సర్వే అసంపూర్తిగా నిలిచిపోయిందని వారు చెప్పారు. వార్డులో సర్వే చేయగా, మిగిలిన ఇళ్లను సర్వే చేసేందుకు సాంకేతిక సమస్యను పరిష్కరించి శుక్రవారం నుంచి సర్వే చేశామని తెలిపారు. వార్డులో మిగిలిన అన్ని ఇళ్లను సర్వే చేస్తారని వివరించారు. కాగా వార్డు ఆఫీసర్ పరశురాంరెడ్డి, బిల్ కలెక్టర్ రాములు యాదవ్‌లు వార్డులో సర్వే చేశారు.

### బోనస్ డబ్బులు ఎప్పుడో?



గోపాల్‌రావు

పాపన్నపేట(మెదక్): సన్న వరికి ఇవ్వాల్సిన బోనస్ ఇంకెప్పుడు ఇస్తారని మండల పరిధిలోని ఆరెపల్లి రైతులు ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. యూసుఫ్‌పేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు సన్న వరి తూకం చేసి 30 రోజులు కావస్తున్నా.. ఇంత వరకు డబ్బులు పడలేదని వాపోయారు. సుమారు 96 మంది రైతులకు ఇప్పటి వరకు డబ్బులు పడలేదన్నారు. కనీసం సంక్రాంతి పండగకు బోనస్ వస్తుందని ఆశించినా, తమ ఆశలు అడియాసలు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బోనస్ చెల్లించక పోతే, వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

### క్రీడలతో స్నేహభావం



ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

కొల్చారం(నర్సాపూర్): క్రీడలు స్నేహానికి వారధిగా మారుతాయని, తద్వారా స్నేహభావం పెంపొందుతుందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలోని క్రీడా మైదానంలో రంగంపేట, పైతర గ్రామాల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదేశాలతో ఈ పోటీలు నిర్వహించినట్లు బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకుడు రవితేజరెడ్డి తెలిపారు. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకుడు పెంటారెడ్డి, ఎల్లేశం, వెంకటనారాయణ, నర్సింలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలి

కాంగ్రెస్ నాయకులు



నార్సింగిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలు నిర్వహించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తన తీరు మార్చుకోవాలని నార్సింగి కాంగ్రెస్ మండల నాయకులు హెచ్చరించారు. శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, యాదగిరియాదవ్, ఎస్సీ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన సీసీరోడ్ల పనులు ప్రారంభించడానికి వచ్చే ఎమ్మెల్యే ఎవరికి సమాచారం ఇవ్వకుండా రావడంపై మండిపడ్డారు. గత ఏడాది ప్రారంభించిన నర్సంపల్లి జీపీ భవనం తిరిగి ప్రారంభించడం ఎందుకని ప్రశ్నించారు. శిలాఫలకపై ఇన్‌చార్జి మంత్రి పేరు పెట్టకపోవడం ఎంటని ప్రశ్నించారు. ప్రభుత్వం నియమించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులకు కూడా సమాచారం ఇవ్వరా అని వాపోయారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాజీ ప్రతినిధులను వెంట బెట్టుకోని ప్రారంభోత్సవాల చేస్తే చూస్తూ ఉరుకునేదిలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేష్, సత్యనారాయణ, రుక్మోద్దీన్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

### చెక్కుల అందజేత

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేషారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, అబ్దుల్‌సుక్రుబాయ్, బేతయ్య, శ్రీనవాస్‌రెడ్డి, శేఖర్, అవినాష్‌రెడ్డి, జైపాల్ తదితరులున్నారు.

### 25 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

కొల్చారం(నర్సాపూర్): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న సీపీఎం పార్టీ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నర్సమ్మ కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మహాసభల సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలరాజు,సురేష్, రవి,రాజు, తదితరులు పాల్గొన్నారు

### పరామర్శ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఓదార్చి ధైర్యం చెప్పారు. శుక్రవారం నార్సింగిలోని శ్రీనివాస్‌గౌడ్ ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అన్నివేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబు, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మల్లేశంగౌడ్ ఉన్నారు.

### ఎస్‌ఐగా పదోన్నతి

శివ్వంపేట(నర్సాపూర్): మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి కష్టపడి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి నేడు ఎస్‌ఐ పదోన్నతి పొందాడు. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ వెంకటేశంకు శుక్రవారం సంగారెడ్డి ఎస్పీ సీహెచ్ రూపేష్ ఎస్‌ఐగా ప్రమోట్ చేస్తూ డబుల్ స్టార్ అందజేశాడు. సంగారెడ్డి రూరల్ ఎస్‌ఐగా నియమించడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

### యువకుడి అదృశ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని చండూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. శుక్రవారం ఎస్‌ఐ నర్సింలు తెలిపి వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చండూర్ గ్రామానికి చెందిన నత్తెనొల్ల రాజు, ఈ నెల 16న ఉదయం 7 గంటలకు తన బైక్‌పై ఇంటిని నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా అచూకీ లభించలేదు. ఇంటి నుండి వెళ్లే సమయంలో అతడు బ్లాక్ స్వెటర్, బ్లూ ప్యాంట్ ధరించి ఉన్నాడని, రాజు భార్య శ్రీలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాయని ఎస్‌ఐ తెలిపారు.

# రైతుభరోసాపై అధికారుల సర్వే



అల్లాదుర్గం(మెదక్): కాయిదంపల్లిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు



శివ్వంపేట(నర్సాపూర్): దొంతిలో సర్వేని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ గృహాలపై అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఏఓ కృష్ణ జూకల్, బద్దారం, బూర్గుపల్లి, మల్కాపూర్, గొట్టిముక్కుల తదితర గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 20 వరకు సర్వే పూర్తి చేసి 21 నుంచి గ్రామసభలు నిర్వహించి అర్హులైన వారి వివరాలను గ్రామసభలో తెలియజేస్తామని, ఏవైనా ఫిర్యాదులు ఉంటే స్వీకరిస్తామని వారు తెలిపారు.

**చిలప్‌చెడ్‌లో..**

చిలప్‌చెడ్(నర్సాపూర్): సాగుభూములు, సాగుకు యోగ్యం కాని భూముల సర్వే చేపట్టామని మండల ఏఓ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గంగారం, గౌతాపూర్, అజ్జమర్రి గ్రామాల్లో రైతుభరోసా భూములపై సర్వే చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముస్తాదిక్, సర్వేయర్ రవిప్రసాద్, ఆర్‌ఐ సునీల్‌సింగ్, ఏఈఓ దివ్య లు పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో..**

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంతో పాటు కాయిదంపల్లి తదితర గ్రామాల్లో రైతుభరోసాపై వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, వ్యవసాయ అధికారి రాజేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**సమగ్రంగా చేపట్టాలి**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దొంతిలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న సర్వేని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శి శేఖర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

# రేషన్‌కార్డుల సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్‌నగర్‌లో కొత్త రేషన్‌కార్డుల సర్వేను ఎంపీడీఓ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన లబ్ధిదారుల వివరాల గ్రామసభలో చదివి వినిపిస్తామని, అనర్హులు ఉంటే సూచించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **అర్ధ నగ్న ప్రదర్శన**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో నస్కల్ రోడ్డు నిర్మాణం కోసం చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఏడో రోజుకు చేరుకుంది. ఈ మేరకు శుక్రవారం దీక్ష శిబిరం వద్ద నస్కల్ చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నస్కల్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేసే వరకు ఈ దీక్షను విరమించమని తెలిపారు. కార్యక్రమంలో రాజు, ఎల్లం, ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **లక్ష డప్పులు కార్యక్రమానికి తరలిరండి**

చిన్నశంకరంపేట(మెదక్): వెయ్యి గొంతుకలు.. లక్ష డప్పులు కార్యక్రమానికి ఇంటికొక్కరు డప్పులతో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మురళి మాదిగ కోరారు. శుక్రవారం చిన్నశంకరంపేట రాధేశ్యామ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 25న రామాయంపేటకు వస్తున్న మంద కృష్ణమాదిగ రథయాత్రకు అధిక సంఖ్యలో దళితులు తరలిరావాలని కోరారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, సామిల్, సుధాకర్, రవి, చెప్యాల మల్లేశం, జనార్ధన్, రామస్వామి, ప్రభాకర్ పాల్గొన్నారు.

◆ **సామరస్యంగా పరిష్కరించుకోండి**



చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని వల్లూర్ గ్రామంలో ఏర్పడిన చేపల చెరువు పంపకాల సమస్యను ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ సూచించారు. శుక్రవారం వల్లూర్ గ్రామంలో ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్, ఇతర కులాలకు మధ్య ఏర్పడిన సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరిస్తే ఇరు వర్గాల వారిని బైండోవర్ చేస్తానని హెచ్చరించారు.

◆ **స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి**

పాపన్నపేట(మెదక్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సగరులు సమాయత్తం కావాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర పిలుపు నిచ్చారు. ఏడుపాయల్లో శుక్రవారం జరిగిన కార్యకర్త సమావేశంలో ఆయన మట్లాడుతూ.. సగరులు రాజకీయంగా ముందడుగు వేయనంత కాలం ఆర్థిక, సాంఘీక వెనకబాటుకు గురవుతుంటారని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా, కౌన్సిర్లుగా, ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా, మండల పరిషత్ అధ్యక్షులుగా పోటీచేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయిలు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దత్తాత్రేయ, కార్య నిర్వాహక కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేశ్, కోశాధికారి బాలకిషన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి యాదగిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు**

నర్సాపూర్: మున్సిపాలిటీలోని పదో వార్డులో కరెంట్ లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించినట్లు శుక్రవారం పదవ వార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ చెప్పారు. వార్డుకు 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించి, ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట 11వ కౌన్సిలర్ రాజేందర్, కాలనీవాసులు ఉన్నారు.

# శీతల మాతకు ఎమ్మెల్యే పూజలు



నర్సాపూర్‌లోని శీతల మాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పట్టణంలోని శ్రీశీతల మాత(నల్లపోచమ్మ) ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు హరికృష్ణశర్మ, హరిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం నుంచి పూజలు చేశారు. లక్ష పుష్పార్చనలో మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం మాధవానంద స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. అలాగే పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అమ్మవారికి పూజలు చేశారు.

**ముగిసిన ఉర్సు**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గంగాయిపల్లిలోని సద్గురు ఓం ఫాజిల్ నగర్ చిష్తి 43వ ఆరాధన ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆశ్రమ నిర్వాహకులు నర్సింలు చిష్తి, నాయప్ చిష్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు. శుక్రవారం ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మైపాల్‌రెడ్డి, కృష్ణ, విరేష్, స్వామి, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, ముత్యం ఉన్నారు.

# అధికారులు రైతులకు సహకరించాలి



అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): రైతులకు బ్యాంకు అధికారులు సహకరించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ రైతులు బ్యాంకు అధికారులు తమకు రుణమాఫీపై సరైన సమాచారం ఇవ్వడం లేదని, రుణాల మంజూరులో ఇబ్బందులు పెడుతున్నారని తెలపడంతో వారితో కలిసి అల్లాదుర్గంలోని ఎస్‌బీఐ బ్యాంకు అధికారులతో మాట్లాడారు. ఫీల్డ్ ఆఫీసర్ నవీన్‌కుమార్‌తో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభు, చెన్నప్ప, కిసాన్‌సెల్ అధ్యక్షుడు బేతయ్య, జైపాల్, చంద్రయ్య, అంజయ్య, కిష్టయ్య, శ్రీనివాస్, సాయిలు, బసవేశ్వర్, వెంకయ్య తదితరులున్నారు.

# గంజాయి నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

నిజాంపేట(మెదక్): యువకులు గంజాయి మత్తు పదార్థాల నిర్మూలనపై కలెక్టర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులతో శుక్రవారం మండలంలోని నందగోకుల్ గ్రామంలో కళాజాత బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో యువకులు గంజాయి, మత్తు, చెడు వ్యసనాలకు అలవాటు పడి వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో యువత తరచు వాహనాలు నడిపేటప్పుడు నియమ నిబంధనలు పాటించకుండా రోడ్డు ప్రమాదానికి గురవుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని పాటలతో చెప్పారు. ఈ కార్యక్రమంలో సిద్దులు, మాధవి, కృష్ణ, ఎల్లయ్య, శేఖర్, దేవదాస్, విజయ లక్ష్మి, రామారావు, నరసయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్నాం



మాట్లాడుతున్న నాగరాజు

నర్సాపూర్: ప్రజలు, కార్మికుల సమస్యలపై సీపీఎం పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని పార్టీ డివిజన్ కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. మహాసభల నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా జెండా ఆవిష్కరణలో భాగంగా నర్సాపూర్‌లో పార్టీ జెండా ఎగురవేసి మాట్లాడారు. మహాసభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగభూషణం, శేఖర్, నర్సింలు, మల్లేశం, ప్రవీణ్, రమేశ్, శేకర్ తదితరులు ఉన్నారు.

# ట్రిపుల్‌ఆర్ భూముల్లో మట్టి తవ్వకాలు

కొరవడిన అధికారుల పర్యవేక్షణ



డంపు చేసిన ఎర్రమట్టి

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ట్రిపుల్ ఆర్ భూముల్లో నుంచి మట్టి తవ్వకాలు దర్జాగా సాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లోని భూముల నుంచి ట్రిపుల్‌ఆర్ రోడ్డు నిర్మాణాన్ని అధికారులు సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేశారు. ఇదే అదునుగా భావించిన మట్టి మాఫియా రంగంలోకి దిగి మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. మండలంలోని గుండ్లపల్లి, పోతులబోగూడ గ్రామాల్లో గుర్తించిన ట్రిపుల్ ఆర్ భూముల్లో నుంచి రాత్రి వేళల్లో జేసీబీలతో ఎర్ర మట్టి తవ్వకాలు చేస్తూ టిప్పర్ల ద్వారా తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. పలువురు వ్యాపారులు పోతులబోగూడ–కొంతన్‌పల్లి ప్రధాన రోడ్డు పక్కన పోతులబోగూడ గ్రామ శివారులో ఎర్ర మట్టిని డంపు చేసి రవాణా చేస్తున్నారు. రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా మట్టిని వ్యవసాయ పొలాల రోడ్డు గుండా తరలిస్తుండడం వల్ల పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మట్టి తవ్వకాలు ఇష్టరాజ్యంగా జరుగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

### పరిహారం ఇవ్వం

ట్రిపుల్‌ఆర్ రోడ్డు కోసం గుర్తించిన భూముల్లో నుంచి మట్టి తవ్వకాలు నిషేధం. అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ట్రిపుల్ ఆర్ భూముల్లో మట్టి తవ్వకాలు చేస్తే ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం ఇవ్వం.

– కమలాద్రి, తహసీల్దార్

### మంత్రి దామోదరకు ఆహ్వానం



మంత్రితో కాంగ్రెస్ నాయకులు

తూప్రాన్: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు కోసం మంత్రిని ఆహ్వానించినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు భగవన్‌రెడ్డి తెలిపారు. సానుకులంగా స్పందించిన మంత్రి ఈ నెల 22న తూప్రాన్‌కు వస్తానని హామి ఇచ్చారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు భగవన్‌రెడ్డి, నాయకులు కృష్ణ, విశ్వరాజ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దళితులు

అల్లాదుర్గం(మెదక్): ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం ఆధ్వర్యంలో మాదిగలు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, గాయకులు సూర్యకుమార్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.